కాంగ్రెస్ వస్తే కరెంట్ కష్టాలు



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మర్రి జనార్దన్‌రెడ్డి

కందనూలు/నాగర్‌కర్నూల్/తాడూరు/తెలకపల్లి: కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే మళ్లీ కరెంట్ కష్టాలు కొని తెచ్చుకున్నట్లేనని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బిజినేపల్లి, తిమ్మాజిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కరెంట్ అడిగితే కాల్చి చంపుతామని బెదిరించిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. వ్యవసాయాన్ని పండగ చేసిన కేసీఆర్‌కు అండగా నిలబడుదామని పిలుపునిచ్చారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు వేసేముందు నాగర్‌కర్నూల్ నియోజకవర్గం 2014వ సంవత్సరానికి ముందు తరువాత ఎలా ఉందో ఆలోచించాలని ఓటర్లను కోరారు. మరోసారి ఆశీర్వదిస్తే ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీ హబ్, పరిశ్రమల ఏర్పాటు చేస్తానన్నారు. అనంతరం నాగం జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, మర్రి జమున తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేగా మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. తాడూరు మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవీ, వైస్ ఎంపీపీ శివలీల, యార రమేష్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సతీమణి మర్రి జమున అన్నారు. తెలకపల్లిలోని నెహ్రూ చౌరస్తాలో రోడ్డు షోలో ఆమె పాల్గొని మాట్లాడారు. మర్రి జనార్దన్‌రెడ్డిని మరోసారి ఆశీదించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సొంత ఖర్చులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. అంతకుముందు జమిస్తాపూర్ గేటు నుంచి తెలకపల్లి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆమె వెంట బైకాని శ్రీనివాస్ యాదవ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఈదుల నరేందర్‌రెడ్డి, ఎంపీపీ కొమ్ము మధు తదితరులు ఉన్నారు.

తప్పనిసరిగా హామీలు నెరవేర్చుతా

కొల్లాపూర్: దైవసాక్షిగా ఇచ్చిన హామీలు నెరవేర్చుతానని లేనిపక్షంలో ఏ శిక్షకైన సిద్ధమని కొల్లాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలపై నియోజకవర్గ ప్రజలకు ఆయన బాండ్ కాగితం రాసిచ్చారు. ఈ సందర్భంగా సింగోటం లక్ష్మీనరసింహ ఆలయంలో బాండ్ రాసి, స్వామివారి పాదాల ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎల్లేని మాట్లాడుతూ కొల్లాపూర్‌కు రైల్వేలైన్ తెస్తానని, పారిశ్రామిక జోన్ మంజూరు చేయిస్తానని, అలంపూర్ నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండ వరకు మరో జాతీయ రహదారి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఒక్కసారి ఆశీర్వదిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. బీజేపీతోనే దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. పేదల సంక్షేమానికి పాటుపడుతానన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలు ఆదర్శంగా నిలిచాయన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ గెలిస్తే అవినీతి, అక్రమాలు పెరుగుతాయన్నారు. నియంతలా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకు బీజేపీకి ఆదరణ పెరుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు. బీసీ అభ్యర్థి సీఎం అయ్యేందుకు అందరు సహకరించాలని కోరారు. ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



బాండు చూపుతున్న కొల్లాపూర్ బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు

బహుజన బిడ్డగా ఆదరించండి



నమస్కరిస్తున్న శిరీష

కొల్లాపూర్: బహుజన బిడ్డగా, దళిత ఆడబిడ్డగా, 40 లక్షల మంది నిరుద్యోగుల ప్రతినిధిగా ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆదరించాలని కొల్లాపూర్ అసెంబ్లీ స్వతంత్ర అభ్యర్థి కర్నె శిరీష అలియాస్ బర్రె లక్క ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం పెద్దకొత్తపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కోటి ఆశలతో ఏర్పడ్డ తెలంగాణలో నిరుద్యోగులు ఉద్యోగాలు లేక రోడ్డునపడ్డారన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విజిల్(ఈల) గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం



తెలకపల్లిలో మాట్లాడుతున్న మల్లురవి



గౌరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి

తెలకపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి అన్నారు. మంగళవారం తెలకపల్లిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. నాగర్‌కర్నూల్‌లో కూచుకుళ్ల రాజేష్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని ఓటర్లను అభ్యర్థించారు. అదేవిధంగా మండలంలోని గౌరారంలో కూచుకుళ్లకు మద్దతుగా మహిళలు ఇంటింటి ప్రచారం చేశారు. తెలకపల్లి మండలంలోని ఆలేరు బొప్పల్లి, పెద్దూరు, గౌరెడ్డిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి పర్యటించారు. కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా పనిచేశానని పేర్కొన్నారు. తన కుమారుడు రాజేష్ రెడ్డికి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, బాలగౌడ్, తదితరులు ఉన్నారు.

సాగునీరు అందిస్తా



అచ్చంపేట రూరల్: అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా నల్లమల ప్రాంతానికి సాగునీరు అందించి రైతుల పాదాలను కృష్ణమ్మ నీటితో కడుగుతానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన రోడ్‌షో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. నల్లమల ప్రాంతంలో పరిశ్రమల స్థాపనతో పాటు ఐటీ రంగాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నర్సింహాగౌడ్, గువ్వల అమల, నాయకులు తులసీరాం, అమీనొద్దిన్, రామాచారి, మనోహర్‌ప్రసాద్, శ్రీనివాసులు, లోక్యానాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా ముందుకు..



కోడేరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉందని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు చేపట్టిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు సోషల్‌మీడియాలో తామే గెలుస్తున్నట్లు హైప్ క్రియేట్ చేస్తున్నారని విమర్శించారు. గ్రౌండ్ లెవల్లో వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. రైతులు, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్‌కు లభిస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు రకరకాల మీటింగ్‌లు పెట్టి ప్రజలను మభ్య పెట్టేందుకు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆపార్టీ నాయకులే నిరుద్యోగ జేఏసీ పేరిట టీషర్టులు వేసుకొని ర్యాలీలు నిర్వహించాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా కొల్లాపూర్‌లో బీఆర్‌ఎస్ గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. ర్యాలీలో రంగినేని అభిలాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: పెద్దకొత్తపల్లి మండలాన్ని ఎన్నో రకాల అభివృద్ధి చేశానని, మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంతో పాటు ముష్టిపల్లి, పెద్దకార్పాముల గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేశానన్నారు. విద్యార్థులకు ఇంటర్ కాలేజీ, తహసీల్దార్ కార్యాలయం, రైతులకు సాగునీరు, పింఛన్లు, రైతుబంధు, తదితర పథకాలను అందించామని గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, ఎంపీటీసీ రేణుక, జెడ్పీటీసీ మాజీ వెంకటయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

గిరిజనుల వేషధారణలో బీరం విజయ

నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి భార్య విజయ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గిరిజనుల సంప్రదాయ వస్త్రాలు ధరించి ఆమె ప్రచారం చేపట్టారు. గిరిజన మహిళలతో కలిసి బంజారా నృత్యాలు చేశారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సతీమణి విజయమ్మ కొత్తబస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 ఏళ్ల పాలనలో కొల్లాపూర్ ప్రాంతానికి జూపల్లి కృష్ణారావు చేసిందేమీ లేదని, ఒక్కసారి గెలిచిన బీరం హర్షవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందు కనిపిస్తుందన్నారు. మరోసారి అవకాశం ఇస్తే రుణం తీర్చుకుంటామని కోరారు. కార్యక్రమంలో రాజేష్, సురేందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, శేషు, యాగొస్,రమణ ఉన్నారు.

కోడేరు: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎత్తం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి పథకాలను చూసి మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి, ఆది కొమ్ము దానయ్య తదితరులు పాల్గొన్నారు.



పెంట్లవెల్లిలో ర్యాలీలో పాల్గొన్న బీరం విజయమ్మ



కొల్లాపూర్‌లో జన సందోహం



పెద్దకొత్తపల్లిలో..

గ్యారంటీ పథకాలతో పేదల సంక్షేమం



కల్వకుర్తిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, కార్యకర్తలు

కల్వకుర్తి/చారకొండ/వెల్దండ: గ్యారంటీ పథకాలతో పేదల సంక్షేమం సాధ్యమని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీలోని గచ్చుబావి వద్ద నుంచి పట్టణ పురవీధుల గుండా హైదరాబాద్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని, అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఇతర పార్టీల అభ్యర్థులకు వణుకు పుడుతోందన్నారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ కసిరెడ్డిని నారాయణరెడ్డిని ప్రతి ఒక్కరు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్‌కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ భారీ బైక్ ర్యాలీ

చారకొండ మండలంలోని జూపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లి, జేపల్లి, ఎర్రవల్లి, అప్పారెడ్డిపల్లి గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. జూపల్లిలో కాంగ్రెస్ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి బైక్ ర్యాలీ ప్రారంభించారు. జూపల్లి వెంకటయ్య యాదవ్, ముజ్జుబాయి, రాములు యాదవ్, బాల్‌రాజు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో రోడ్‌షో

సకలజనుల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎంపీ మంద జగన్నాథం, కల్వకుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా వెల్దండ మండల కేంద్రంతో పాటు బొల్లంపల్లి, బండోనిపల్లి, చొక్కన్నపల్లి, గుండాలలో వారు రోడ్‌షో నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌కు అందరు మద్దతు ఇవ్వాలని కోరారు. అన్ని సర్వేలు చేసిన కాంగ్రెస్‌పార్టీకి అనుకూలంగా వచ్చాయన్నారు. సర్పంచ్ భూపతిరెడ్డి, నాయకులు బాలాజీసింగ్, మట్ట వెంకటయ్యగౌడు, మోతీలాల్‌నాయక్, జంగయ్యయాదవ్, సంజీవ్‌కుమార్, ఎర్రశ్రీనుముదిరాజ్, కృష్ణముదిరాజ్, పర్వత్ రెడ్డి, హమీద్, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



జూపల్లిలో నినాదాలు చేస్తున్న ఆశాదీప్‌రెడ్డి

సోనియాగాంధీకి రుణపడి ఉందాం



ఉప్పునుంతల/అచ్చంపేట రూరల్: తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి రుణపడి ఉందామని అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గువ్వలోనిపల్లి, పెనిమిళ్ల, సీబీ తండాలో నిర్వహించిన రోడ్ షో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. పెనిమిళ్ల వరకు కేఎల్ఐ ద్వారా సాగునీరు అందిస్తామని చెప్పి మోసం చేశారన్నారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ అనంతప్రతాప్ రెడ్డి, సర్పంచ్ కట్టా సరిత, మోపతయ్య, అనంత రెడ్డి, నర్సింహ్మారెడ్డి, నర్సింహ్మారావు, విజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జంగిరెడ్డి పాల్గొన్నారు.

ఓయూ జేఏసీ నాయకుల ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణను అధిక మెజారిటీతో గెలిపించాలని ఓయూ జేఏసీ నాయకులు సత్యం, శివ, అరుణ్‌కుమార్, హరిశ్చంద్ర, వరుణ్ కోరారు. పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళులర్పించారు.

కాంగ్రెస్ హామీలు నమ్మొద్దు



కల్వకుర్తిరూరల్: కాంగ్రెస్ హామీలు నమ్మొద్దని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికుట్రలు చేసినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్యారంటీ పథకాలు నమ్మి మోసపోవద్దని ఓటర్లకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, షాహెద్, మనోహర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

సేవకుడిలా పనిచేస్తా



కల్వకుర్తిరూరల్: ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఆశీర్వదిస్తే సేవకుడిలా పనిచేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కల్లోజు ఆచారి అన్నారు. మంగళవారం పట్టణంలో ప్రచారంలో భాగంగా భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పాత బజారులో ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీతోనే దేశ రక్షణ సాధ్యమన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ హామీలు నమ్మి మోసపోవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

కొల్లాపూర్ వాసి ఏఎస్పీ మురళి మృతి

కొల్లాపూర్: హైదరాబాద్‌లోనే స్థిరపడిన పట్టణానికి చెందిన ఏఎస్పీ మ్యాదరి మురళి(56) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన జీహెచ్‌ఎంసీలో ఏఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నారని కుటుంబసభ్యులు తెలిపారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఊర్కొండలో

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని కొల్లాపూర్, వెల్దండ, ఊర్కొండ, పదర, వంగూరు మండలాల్లో మంగళవారం ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి స్థానిక ఎస్ఐల ఆధ్వర్యంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 132 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా అధికారులు గుర్తించారు. అన్ని కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ మోహన్‌కుమార్ వెల్లడించారు. పోలింగ్ సమయం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ప్రజలు గుంపుగా ఎక్కడ ఉండకూడదని ఆయన సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు.



కోడేరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

క్లుప్తంగా

కొనసాగుతున్న వాహనాల తనిఖీలు

తాడూరు: మండలంలోని మేడిపూర్ దగ్గర ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. మంగళవారం తనిఖీ అధికారి వాలేందర్ నాయక్ ఆధ్వర్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా పూలే వర్ధంతి



మన్ననూర్: స్థానిక గ్రంథాలయం ఆవరణలో జ్యోతిరావు పూలే 133వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర నాయకుడు మంచల అరుణ్ పాండ్యన్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. పూలే ఆశయాలు సాధిద్దామని కోరారు. దళితులు, బహుజనులు, అణగారిన వర్గాలు, అగ్రవర్ణ పేదల కోసం నిరంతరం పోరాడారన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఉదయ్, మధు, పవన్, కార్తీక్, యశ్వంత్, ప్రజ్వల్ పాల్గొన్నారు.

నియంత పాలనను సాగనంపండి



పెంట్లవెల్లి/కొల్లాపూర్: రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందని ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని కర్ణాటక కాంగ్రెస్ మంత్రి సుధాకర్ అన్నారు. మంగళవారం పెంట్లవెల్లి మండలంలోని మంచాలకట్టలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ మాయ మాటలు నమ్మొద్దన్నారు. గ్యారంటీ పథకాలు తప్పకుండా అమలు చేస్తామన్నారు. కొల్లాపూర్‌లో ర్యాలీలో జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనన్నారు. కోడేరు మండల కేంద్రంలో భారీ ర్యాలీ మాజీ మంత్రి జూపల్లి హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల ఘర్షణ

బల్మూర్: ఎన్నికల ప్రచార చివరి రోజు మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరస్పర దాడులు చేసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం వెనుక బీఆర్‌ఎస్ కార్యకర్తలు భోజనం చేస్తుండగా అదే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపై నుంచి ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్నారు. దీంతో ఒకరికొకరు ఎదురుపడగా విమర్శలు చేసుకున్నారు. దీంతో మాట మాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. పోలీసులు ఇరు వర్గాలను చెదరగొట్టారు. గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో ప్రజలు భయం దోళనకు గురయ్యారు. ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

మన్ననూర్: స్థానిక పురుగుల గుట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం అమ్రాబాద్ మండలం బీకే ఉప్పునుంతల గ్రామానికి చెందిన యువకులు అచ్చంపేటలో జరుగుతున్న బైక్ ర్యాలీకి బైక్‌పై ముగ్గురు వెళ్తున్నారు. పురుగులగుట్ట సమీపంలోకి రాగానే ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేసే క్రమంలో ట్రాక్టర్‌కు వెనుక భాగంలో బిగించి ఉన్న నాగలికి తగిలి రోడ్డుపై పడ్డారు. దీంతో రహీం, ఈదయ్యకు స్వల్ప గాయాలు కాగా నల్లబోతుల ఈదయ్యకు తలకు తీవ్ర గాయం అయ్యింది. బాధితులను మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోర్టు ఉద్యోగులు ప్రతిజ్ఞ

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ పీఠికలోని అంశాలతో కోర్టు ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. న్యాయాన్ని కాపాడుతూ, చట్టాల పరిరక్షణకు బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి జడ్జిలు ఆర్వీఎస్ఎస్ మిథున్‌తేజ, జ్యోత్స్న సూచించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో తహసీల్దార్ సైదులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఆర్ఐ సురేందర్, జమ్ములయ్య, తదితరులు పాల్గొన్నారు.